

డీసీఈబీ కాంప్లెక్స్‌లో షాపులకు టెండర్లు

కరీంనగర్ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ పరిధిలోని డీసీఈబీ కాంప్లెక్స్‌లోని షాపుల కోసం ఓపెన్ టెండర్ ప్రక్రియను అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ గురువారం నిర్వహించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఓపెన్ టెండర్ ప్రక్రియను నిర్వహించారు. ఐదు సంవత్సరాల పాటు అద్దె కేటాయింపు కోసం ఈ టెండర్లు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, డీసీఈబీ కార్యదర్శి స్వదేశీకుమార్, జిల్లా సైన్స్ అధికారి జయపాల్‌రెడ్డి, ప్రణాళిక సమన్వయ కర్త ఎ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోండిలా..

6



ప్రతీ రైతుకు యునీ కోడ్

- కేంద్ర వ్యవసాయ పథకాల కోసం ఫార్మర్ రిజిస్ట్రీ
- సంక్షేమ పథకాలతో అనుసంధానం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కేంద్ర ప్రభుత్వం దేశంలో ప్రతి పౌరుడికి ఆధార్ కార్డు జారీ చేసిన తరహాలోనే ప్రతి రైతుకు "రైతు విశిష్ట సంఖ్య" ఫార్మర్ యునీ కోడ్‌ను ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు ఈ నెల 5 నుంచి ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను అనుసంధానం చేస్తారు. పీఎం కిసాన్, తదితర వ్యవసాయాధారిత కేంద్ర పథకాల వర్తింపులో ఈ కార్డు కీలకపాత్ర వహించనున్నది. మే 5 నుంచి జూన్ 6 వరకు రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం అమలుకు వ్యవసాయ విస్తరణ అధికారులు నిర్ణీత షెడ్యూల్ మేరకు ఆయా గ్రామాల్లో పర్యటించి రైతుల పేర్లను నమోదు చేసుకుంటారు. ఏఈవోలు గ్రామానికి వచ్చినప్పుడు గాని, మీసేవ ద్వారాగాని వెబ్‌సైట్‌లో లాగిన్ అయి రైతు తన ఆధార్ నంబర్‌ను పట్టాదారు పాస్‌పుస్తకం లేదా 1బిని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. భూమి ఉన్న ప్రతి రైతు తన భూముల వివరాలను ఈ ఫార్మర్ రిజిస్ట్రీలో పొందుపర్చుకుని

(మిగతా 8వ పేజీలో)

ఇలా నమోదు చేసుకోవాలి

మీసేవ కేంద్రాలకు వెళ్లి వెబ్‌సైట్‌లో లాగిన్ అయిన తర్వాత రైతు తన ఆధార్ నంబర్‌ను నమోదు చేయాలి. ఆధార్‌కు లింకు చేసిన మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని ఎంటర్ చేసిన తర్వాత రైతు మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేయాల్సి ఉంటుంది. మరోసారి ఓటీపీ వచ్చిన తర్వాత మాత్రమే రైతు వివరాలు ఆన్‌లైన్‌లో డిస్‌ప్లే అవుతాయి. ఆ సర్వే నెంబర్లను సెలక్ట్‌చేసి సబ్మిట్ చేస్తే మరోసారి ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ ఎంటర్ చేసిన తర్వాత రైతుకు 11 సంఖ్యల ఫార్మర్ రిజిస్ట్రీ నంబర్ జనరేట్ అవుతుంది. ఈ నంబర్ రైతు మొబైల్‌కు వస్తుంది. దీంతో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ పూర్తవుతుంది. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టింది. రైతులందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ కోరింది.

యూరియా అధికంగా వాడొద్దు

- జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి

జమ్మికుంట, మే 5 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగు చేసేటప్పుడు యూరియా అధికంగా వాడొద్దని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. జమ్మికుంట మండలం మడిపల్లిలోని రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఫారసు మేరకు మాత్రమే యూరియా వాడాలని సూచించారు. క్రిమి సంహారక మందులు విచక్షణ రహితంగా వాడకూడదని తెలిపారు. పచ్చి రొట్ట పైరులు, సేంద్రీయ ఎరువులను తప్పకుండా వాడి నేల ఆరోగ్యాన్ని కాపాడి భావితరాలకు సారవంతమైన నేలలను అందించాలన్నారు. రైతులు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల కొనుగోలు విషయాల్లో జాగ్రత్త వహిస్తూ వాటి రసీదులను పంటకాలం ముగిసే వరకు భద్రపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాస్‌రావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇ శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నరేందర్, డాక్టర్ ఇ నర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

డంపు యార్డుకు చెత్తను తగ్గించాలి

- కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): డంపు యార్డుకు చెత్తను తగ్గించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం నగరంలోని భగత్‌నగర్, విద్యానగర్ ప్రాంతాల్లో పర్యటించి చెత్తను వేరుచేయడంపై అపార్ట్‌మెంట్ వాసులు, మహిళలకు అవగాహన కల్పించారు. చెత్తను మూడు రకాలుగా వేరు చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం చాలా వరకు డంపు యార్డుకు చెత్త వాహనాలు వెళ్లకుండా చేస్తున్నట్లు తెలిపారు. తడి చెత్త ద్వారా డంపు యార్డుకు చాలా వరకు చెత్త తగ్గుతుందని తెలిపారు. డంపు యార్డులో బయోమైనింగ్ ప్రక్రియను నిరంతరంగా కొనసాగిస్తున్నామన్నారు. ప్రజలు సాధ్యమైనంత వరకు ఇంట్లో చెత్తను సెగ్రిగేషన్ చేసి తడి చెత్తను హోం కంపోస్టు చేసి, పొడి చెత్తను డీఆర్‌సీసీలకు తరలిస్తే డంపు యార్డుకు చాలావరకు చెత్త తగ్గుతుందని తెలిపారు. ప్రజలు వందశాతం సెగ్రిగేషన్‌పై దృష్టిపెట్టి చెత్తను వేరుచేసి నగరపాలకసంస్థకు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు సీజ్

- ఆరు దుకాణాలకు రూ. 24 వేల జరిమానా



నగరపాలక సంస్థ అధికారులు స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ వస్తువులు

కరీంనగర్ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై నగరపాలక సంస్థ దృష్టి సారించింది. నగరపాలక సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు నగరంలోని టవర్‌సర్కిల్‌లో పలు వ్యాపార దుకాణాల్లో సోమవారం తనిఖీ నిర్వహించాయి. ఆరు షాపుల్లో దాదాపు 100 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు లభించగా స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. 24 వేల రూపాయల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ స్వామి మాట్లాడుతూ దుకాణాదారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను అమ్మవద్దన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఎస్‌ఐలు వెంకన్న, శ్రీనివాస్, సర్వోత్తమ్, శ్రీధర్, డీఆర్‌ఎఫ్ మల్లేశం, మెప్మా సీవో తిరుపతి, జవాన్లు నర్సయ్య పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

సుభాష్‌నగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే దరఖాస్తులకు ప్రాధాన్యమిచ్చి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ పమేలాసత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి 348 దరఖాస్తులు వచ్చా యని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, మున్సిపల్ కమి షనర్ చాహత్‌బాజ్ పాయ్, డీఆర్వో వెంక టేశ్వర్లు, డీటీడీవో పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్




సైదాపూర్ మండలం ఆకునూర్ గ్రామంలో రెవన్యూ సదస్సులో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్

సైదాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): భూభారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెడుతున్న భూ భారతి(ఆర్వోఆర్) చట్టం అమలులో భాగంగా జిల్లాలో సైదాపూర్ మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసింది. సోమవారం మండలంలోని ఆకునూర్, గొడిశాల గ్రామాలలో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించి రసీదులు అందజేశారు. చిన్న చిన్న సమస్యలు వెంటనే పరిష్కా రమయ్యే విధంగా చర్యలు తీసుకున్నారు. మిగత దరఖాస్తులు పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఆకునూర్, గొడిశాల రెవెన్యూ సదస్సులను అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకుంటే భూ భారతి చట్టం ద్వారా పరిష్కరిస్తామన్నారు. అన్ని గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. మొదటి రోజు భూ సమస్యలపై ఆకునూర్ గ్రామంలో 198, గొడిశాలలో 72, రెండు గ్రామాల్లో 270 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. గొడిశాల, ఆకునూర్ రెవెన్యూ సదస్సులను వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దొంత సుధాకర్, సింగిల్‌విండో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డిలు సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్లు శ్రీనివాస్, కనకయ్య, రమేష్, డీటీలు నాగార్జున, సాయి కృష్ణ, వినయ్, కిషన్, సమ్మయ్య, అరుణ్, సర్వేయర్లు పాల్గొన్నారు.

వడదెబ్బపై ఉపాధి కూలీలకు అవగాహన

జమ్మికుంట రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం వావిలాల పెద్ద చెరువు వద్ద పని చేస్తున్న ఉపాధి కూలీలకు వడదెబ్బపై పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామి కూలీలు, వ్యవసాయ కూలీలకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నీళ్లు, పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం, ద్రవ పదర్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రమ, ఆశ కార్యకర్త రమ, ఫీల్డ్ అసిస్టెంట్ కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో స్వల్ప భూకంపం



కరీంనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో సోమవారం సాయంత్రం 6:50 గంటలకు భూమి రెండుసార్లు వెంట వెంటనే స్వల్పంగా కంపించింది. సమీపంలో పేలుడు సంభవిస్తే ప్రకంపనలు వచ్చిన మాదిరిగా భూమి కంపించడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 3.8 నుంచి 3.9గా నమోదైనట్లు తెలుస్తున్నది. కరీంనగర్‌లో భూ ప్రకంపనల తర్వాత కొద్దిసేపట్లోనే గాలి, దుమారం ప్రారంభమై కరెంట్ పోవడంతో ప్రజలు ఏమవుతుందో తెలియక భయభ్రాంతులకు గురయ్యారు. గత నెల 10 నుంచి 17వ తేదీ వరకు జిల్లాలో భూమి కంపించే అవకాశం ఉందని శాస్త్రజ్ఞులు ప్రకటించినా అప్పుడు ఏమి జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనూహ్యంగా సోమవారం భూమి కంపించడంతో ప్రజలు వీధుల్లోకి వచ్చి అదే విషయాన్ని చర్చించుకున్నారు. కరీంనగర్‌తోపాటు కొత్తపల్లి, చొప్పదండి, తిమ్మాపూర్, మానకొండూర్, గన్నేరువరం, గంగాధర, రామడుగు మండలాల్లో భూమి కంపించింది.

డంప్ యార్డులో మంటలు





కరీంనగర్ బైపాస్ సమీపంలోని డంప్‌యార్డులో సోమవారం రాత్రి మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా ఈదురు గాలులు వీయడంతో మంటలు త్వరగా విస్తరించాయి. కాసేపటికి వర్షం కురియడంతో కాస్త తగ్గినా పొగతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడ్డారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి కరీంనగర్

- లైక్‌లు, వ్యూస్ కోసం ప్రాణాంతక విన్యాసాలు
- రైలుపై, వాగులో రీల్స్ చేస్తూ ఇద్దరి మృత్యువాత
- బైక్ రేస్‌లు నిర్వహించి రీల్స్ తీస్తూ పలువురు ఆసుపత్రిపాలు



ప్రాణాలు తీస్తున్న 'రీల్స్' పిచ్చి

కరీంనగర్ క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): పిచ్చి పలురకాలు.... వెర్రి వెయ్యి రకాలు అంటే ఇదేనేమో... నేటి యువత సోషల్ మీడియాలో లైకులు, వ్యూస్, కామెంట్స్ కోసం ప్రాణాంతకమైన విన్యాసాలు చేస్తూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. సోషల్ మీడియాలో తక్కువ సమయంలో పాపులర్ అయ్యేందుకు యువత వింతపోకడలకు పోతున్నది. ప్రస్తుతం సోషల్ మీడియా కాలం నడుస్తోంది. చాలామంది వివిధ రకాల వీడియోలు, రీల్స్ చేస్తూ ఫేమస్ అవుతున్నారు. యువత రీల్స్ పిచ్చి ఇప్పుడు పరాకాష్టకు చేరింది. యువతీ యువకులే కాదు మధ్య వయస్కులు కూడా ఈ రీల్స్ ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నారు. రోడ్లపై, వాహనాలపై, నీటిలో, రైలు పట్టాలు, నడుస్తున్న బస్సులు, రైళ్లలో ప్రమాదకరమైన విన్యాసాలు, అసభ్యకరమైన, జుగుప్సాకరమైన పనులు చేస్తున్నారు. అన్నిసార్లు పరిస్థితులు అనుకూలంగా ఉండవు. చాలా సందర్భాల్లో యువతీ యువకులు రీల్స్ చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారు.

రీల్స్‌తో అనర్థాలు....

రీల్స్‌చేసేవారికి ప్రమాదాలు పొంచి ఉంటే, వాటిని చూసేవారికి కూడా మరోరూపంలో నష్టాలు ఉన్నాయి. రీల్స్‌తో పాటు రకరకాల యాడ్స్ వస్తుంటాయి. పొరపాటున వీటి బారిన పడితే డబ్బులు పోవడం ఖాయం. ఆన్‌లైన్ రమ్మీ, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్, ఆన్‌లైన్ ట్రేడింగ్, షేర్స్, విదేశీ ట్రిప్‌ల పేరిట ఆకర్షణీయమైన ప్రకటనలతో వీక్షకులను మొదట ముగ్గులోకి లాగుతారు. కొన్ని రోజులు లాభాలు ఇచ్చినట్లు చేసిన ఆయా సంస్థలు ఆ తర్వాత చేతులెత్తేస్తాయి. అప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా లాభం లేకుండా పోతుంది. సోషల్ మీడియా మోజులో పడి చాలామంది తమ కుటుంబాలను పట్టించుకోవడం లేదు. నెట్టింట్లో వచ్చే లైక్స్, కామెంట్ల కోసం.. కుటుంబ సభ్యులతో, ఆత్మీయులతో గొడవలు పడేందుకు కూడా సిద్ధమవుతున్నారు. కొందరైతే దాడి చేయడానికి, చివరికి హత్య చేసేందుకు కూడా వెనుకాడడం లేదు.

పలు ప్రమాదాలు

రీల్స్ మోజులో పడి కరీంనగర్‌కు చెందిన అర్బాజ్ అనే యువకుడు తాజాగా ప్రాణాలు కోల్పోయాడు. అందరికన్నా వినూత్నంగా చేయాలని మరో ఇద్దరు స్నేహితులతో కలిసి కరీంనగర్ శివారులోని మానేరు వాగు నీటిలో రీల్స్ చేసే ప్రయత్నం చేయగా ప్రమాదవశాత్తు నీటిలోమునిగి మరణించాడు. అక్కడే వీడియోతీస్తున్న ఇద్దరు స్నేహితులు నీటిలో మునుగుతున్న అర్బాజ్‌ను కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ లాభం లేకుండా పోయింది. ఏడాదిన్నర క్రితం కరీంనగర్‌కు చెందిన ఒక యువకుడు తీగలగుట్టపల్లిలోని రైల్వేస్టేషన్‌లో నిలిచి ఉన్న రైల్‌పైకి ఎక్కి అక్కడ రీల్స్ చేస్తుండగా విద్యుధాఘాతానికి గురై కిందపడడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. కరీంనగర్ శివారులోని మానేరు బైపాస్ రోడ్, మల్కాపూర్, చింతకుంట బైపాస్‌రోడ్, బొమ్మకల్ బైపాస్‌రోడ్, పెద్దపల్లి ఫ్లై ఓవర్, తీగల వంతెన, మానేరు కట్టపై యువకులు బైక్‌లతో రీల్స్ చేస్తూ తరచుగా ప్రమాదాలబారిన పడుతున్నారు. బైక్ అతివేగంగా నడుపుతూ రీల్స్ చేసే యత్నంలో రోడ్డు డివైడర్‌కు ఢీకొట్టడం, ఎదురుగా వాహనాలను ఢీకొట్టడం వంటి ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇటీవల బైపాస్‌రోడ్‌లలో జరిగిన యువకుల రోడ్డు ప్రమాదాలు చాలామట్టుకు రీల్స్ చేస్తూ ప్రమాదాల బారిన పడినవిగా చెబుతున్నారు.

జీవితంలో భాగమైన సోషల్ మీడియా...

స్మార్ట్ ఫోన్స్ అందుబాటులోకి వచ్చాక లైఫ్ స్టైల్ మారిపోయింది. కరోనా సమయంలో విద్యార్థులకు జూమ్ క్లాస్‌ల కోసం స్మార్ట్‌ఫోన్స్ ఎక్కువగా అందుబాటులోకి వచ్చాయి. ఇదే అలవాటుగా మారి కొంతమంది విద్యార్థులు ఫోన్‌కు బానిసలుగా మారారు. కరోనా సమయంలో చదువులో వెనుకపడొద్దనే ఉద్దేశంతో ఆన్‌లైన్ క్లాస్‌ల కోసం పిల్లలకు ఫోన్లను కొంటే అది ఇప్పుడు సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా నిత్య జీవితంలో భాగమైంది. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా సోషల్ మీడియాలో రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. లైకుల కోసం, కామెంట్ల కోసం నానా ప్రయత్నాలు చేస్తున్నారు. అసలు ఎలాంటి పరిస్థితుల్లో ఉండి రీల్స్ చేస్తున్నామనే సంగతి మరిచిపోతున్నారు. కొందరు డ్యాన్సులతో, మరికొందరు ఫన్నీ వీడియోస్‌తో, క్రియేటివ్ కంటెంట్‌తో, ప్రమాదకర విన్యాసాలతో రీల్స్‌చేసి సెలబ్రిటీ అయిపోవాలని చూస్తున్నారు. నడిరోడ్డుపై డ్యాన్సులు, బైక్‌లతో విన్యాసాలు, బర్త్‌డే వేడుకలు చేస్తూ ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలిగేలా వ్యవహరిస్తున్నారు.

నకిలీ మందులు అమ్ముతున్న వ్యక్తిని పట్టుకున్న గ్రామస్థులు

కాల్వశ్రీరాంపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆశన్నపల్లె గ్రామపంచాయతీ కార్యాలయంలో నకిలీ మందులు అమ్ముతున్న కొంకటి రమేష్ అనే వ్యక్తిని సోమవారం గ్రామస్థులు పటుకున్నారు. ఈ విషయంపై మెడికల్ సిబ్బందికి సమాచారం అందించగా కూనారం ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భావన ఆశన్నపల్లెలో మందులు పరిశీలించారు.డాక్టర్ భావన మాట్లాడుతూ ఆశన్నపల్లి గ్రామపంచాయతీలో సంజీవని నేషనల్‌కేర్ సెంటర్‌కు సంబంధించిన కొంకటి రమేష్ ఎక్స్‌పైరీ అయిపోయిన మందులను గ్రామస్థులకు అమ్ముతున్నాడని తెలిపారు. ఈ మందులు వాడటం వల్ల సైడ్‌ఎఫెక్ట్ కూడా ఉంటాయన్నారు.

గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి..

గ్రామకార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని మాజీసర్పంచ్ మంద రమ వెంకన్న, గాజుల మోహన్, కూస రవి, ఎరుకల మల్లయ్య తదితరులు డాక్టర్‌కు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యదర్శి సంజీవ్ గ్రామంలో ఊరు చాటింపు వేయించి గ్రామపంచాయతీలోనే మెడికల్ క్యాంపు నిర్వహించిన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈమందులు ఇచ్చే అతను పరీక్షలకు 200రూపాయలు, మందులకు 1000 నుంచి 1200రూపాయలు వసూలు చేశాడని ఈవిషయంపై జిల్లా కలెక్టర్ స్పందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వేములవాడ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ, బస్సు ద్విచక్ర వాహం ఢీకొన్న సంఘటనలో ఒకవ్యక్తి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం.. కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన రాజు తన ద్విచక్రవాహనంపై సిరిసిల్లకు వెళుతుండగా డివైడర్‌ను ఢీకొని ఎదురుగా సిరిసిల్ల నుంచి వేములవాడకు వస్తున్న బస్సుకు ఢీకొన్నాడు. ఈ సంఘటనలో రాజుకు తీవ్రగాయాలు కావడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష


జగిత్యాల అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల కేంద్రంలో కొన్ని రోజుల క్రితం పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తికి స్పెషల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ కరుణాకర్ రెండు రోజులజైలు శిక్ష విధించారు. కొన్నిరోజుల క్రితం పట్టణంలో డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించగా వరికొప్పుల పరషరాం అనే వ్యక్తి పట్టుబడగా పట్టణ ఇన్‌స్పెక్టర్ వెణుగోపాల్ అతనిని కోర్టులో ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ రెండు రోజుల శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు..

వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోండిలా

వేసవి సెలవులంటే పిల్లలకు చాలా ఇష్టం. పది నెలలుగా ప్రతి రోజు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులంతా ఆటలు ఆడుతూ పాటలు పడుతూ కాలక్షేపం చేస్తు ఆనందంగా గడుపుతారు. వివిధ రకాల ఆటలు ఆడుతూ ఎంజాయ్ చేస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు ఈత కోసం చెరువులు, బావుల దగ్గర హంగామా చేస్తారు. పట్టణాల్లో పిల్లలు స్విమ్మింగ్‌పూల్‌కు బాట పడుతున్నారు. నృత్యంలో శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొంత మంది పిల్లలు కంప్యూటర్ నేర్చుకుంటున్నారు. వేసవిలో చిన్నారులు నేర్చుకునే అంశాలపై 'ఆంధ్రజ్యోతి' కథనం..

- చొప్పదండి,ఆంధ్రజ్యోతి

ఇష్టమైన రంగాల్లో రాణించేందుకు శిక్షణ



ఖోఖోతో వ్యాయామం

ఖోఖో ఆటలో పరిగెత్తడం ద్వారా రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. ఆటలో క్రీడాకారుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో మిత్రులతో స్నేహభావం పెరుగుతుంది. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడానికి ఈ గ్రామీణ కీడ్ర ఎంతో దోహదపడుతుంది. వాలీబాల్ ఆటతో శరీరంలో అన్ని అవయవాలు కదులుతాయి. కాళ్లకు చేతి కండరాలకు పని చేప్పే ఆట. వాలీబాల్ అందరికి మంచి వ్యాయాయాన్ని అందించే ఆట.

గ్రామీణ ఆట కబడ్డీ

గ్రామీణ ఆటలలో కబడ్డీది ప్రత్యేక స్థానం. ఈ ఆటతో శరీరక ధృడత్వం పెరగడంతోపాటు రక్తప్రసరణ వృద్ధి చెందుతుంది. ఎముకలు బలపడుతాయి.

క్రికెట్‌తో చురుకుదనం

విద్యార్థులు అత్యంత ఇష్టపడే ఆటల్లో క్రికెట్ ఒకటి. సెలవు వచ్చిందంటే బ్యాట్, బంతితో నలుగురు పిల్లలు కలిసి గ్రౌండ్‌కు వెళ్తంటారు. క్రికెట్‌తో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతోపాటు, చురుకుదనం పెరుగుతుంది. మానసిక ప్రశాంతత, స్నేహభావం పెంపొందుతుంది.

క్యారమ్స్‌తో ఏకాగ్రత

ఏకాగ్రతతో లక్ష్యాన్ని ఎలా గురి పెట్టాలో నేర్పేదే క్యారమ్స్. విద్యార్థులు వేసవిలో ఇంటి దగ్గర నేర్చుకోవచ్చు.దీనితో చదువులో ఏకాగ్రత పెరుగుతుంది.

మెదడుకు పని చెప్పే చదరంగం

విద్యార్థుల మేధస్సుకు పనిచెప్పే ఆటల్లో చదరంగం ముఖ్యమైంది. ఈ ఆటతో విద్యార్థికి సమయస్ఫూర్తి, ఆలోచనాశక్తి సమస్యలను ఎలా పరిష్కరించాల్లో నేర్పుతుంది. ఇంటి వద్దనే విద్యార్థి శిక్షకుడి సహాయంతో నేర్చుకోవచ్చు.



క్రికెట్‌తో చురుకుదనం

విద్యార్థులు అత్యంత ఇష్టపడే ఆటల్లో క్రికెట్ ఒకటి. సెలవు వచ్చిందంటే బ్యాట్, బంతితో నలుగురు పిల్లలు కలిసి గ్రౌండ్‌కు వెళ్తంటారు. క్రికెట్‌తో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతోపాటు, చురుకుదనం పెరుగుతుంది. మానసిక ప్రశాంతత, స్నేహభావం పెంపొందుతుంది.



కంప్యూటర్ విద్య




నేటి పోటి ప్రపంచంలో కంప్యూటర్ విద్య తప్పనిసరిగా మారింది. దీని ప్రాధ్యాన్యాన్ని గుర్తించి వేసవిలో చిన్నారులకు కంప్యూటర్ పరిజ్ఞానం శిక్షణ పొందడానికి మంచి అవకాశం. ప్రతి ఒక్కరూ కంప్యూటర్‌పై పరిజ్ఞానం పెంచుకోనేందుకు కృషి చేస్తున్నారు.

ఇంగ్లీష్‌పై పట్టుకు ప్రయత్నం

ఉజ్వల భవిష్యత్‌కు ఇంగ్లీష్ భాష ప్రతి చిన్నారికి అవసరం. చదువుకునే కోర్సు, పోటి పరీక్షలో రాణించేందుకు అవసరమైన ఇంగ్లీష్ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు వేసవిలో స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకునేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు.

డ్రాయింగ్ నేర్చుకోవడానికి చక్కని అవకాశం..

విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చూసుకోవడానికి, తమలో స్నజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపయోగపడేవాటిలో పెయింటింగ్ ముఖ్యమైనదని ఉపాధ్యాయులు చెబుతుంటారు. విద్యార్థులు వాటిలో శిక్షణ తీసుకుని అద్భుతాలు సృష్టించడానికి చక్కని అవకాశం. విద్యార్థులు వివిధ రకాల బొమ్మలను తమారు చేయడంలో శిక్షణ పొందవచ్చు.





ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య



శారద (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామపరిధిలోగల జగ్గయ్యపల్లెకు చెందిన శారద(23) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కమాన్‌పూర్ మండలం జూలపల్లికి చెందిన శారదను ఏడుసంవత్సరాల క్రితం జగ్గయ్యపల్లెకు చెందిన ఉప్పుల అజయ్‌కుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఆరునెలలుగా శారద మానసిక పరిస్థితి బాగాలేకపోవడంతో కరీంనగర్‌లోని వైద్యులకు చూపించారు. ఆదివారం రాత్రి ఇంటిముందు రేకుల షెడ్డులో శారద ఉరివేసుకుంది. సోమవారం ఉదయం భర్త అజయ్‌కుమార్ గమనించి శారద కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతురాలికి కుమారుడు ఉన్నాడు. శారద తండ్రి రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

ఓసీపీ-5లో ప్రమాదం: కాంట్రాక్టు కార్మికుడు మృతి

గోదావరిఖని, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-1 ఏరియా ఓసీపీ-5 ప్రాజెక్టులోని 1సీమ్ కోల్‌బెంచ్‌లో సోమవారం ట్యాంకర్ బోల్తా పడిన ప్రమాదంలో అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్, బీహార్‌కు చెందిన వికాస్ కుమార్(34) మృతి చెందాడు. వికాస్ కుమార్ పీసీ పటేల్ కంపెనీలో పని చేస్తున్నాడు. బ్లాస్టింగ్‌సెక్షన్‌లో పనిచేస్తున్న వికాస్‌కుమార్ ఎక్స్‌ప్లోజివ్ ట్యాంకర్‌పై ఎక్కివస్తున్నాడు. ట్యాంకర్ బోల్తా పడుతుండగా తప్పించుకునేందుకు వికాస్ కిందకు దూకాడు. ట్యాంకర్ వెనుక టైరు అతనిపై నుంచి వెళ్లడంతో మృతి చెందాడు. టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

ఇల్లంతకుంట, మే 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బాలసాని ఆశాలు(86) అనే వృద్ధుడు క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. ఆశాలు బస్టాండు సమీపంలో దుకాణం నడుపుతుంటాడు. వారం రోజుల క్రితం దుకాణంలోకి ఓ బాలిక వచ్చిన సందర్భంగా చిన్న వివాదం జరిగింది. దీంతో బాలిక ఇంటికి వెళ్లి తన అక్కకు విషయం తెలిపింది. ఆ తర్వాత వృద్ధుడు తనను దూషించాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆశాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కొంత సమయానికి ఇంటికి పంపించారు. దీంతో మనస్థాపం చెందిన ఆశాలు ఆదివారం ఇంట్లో క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిపై ఎస్సై శ్రీకాంత్‌గౌడ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు రావడంతో పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారణ జరిపామని తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి

కరీంనగర్ క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో ఉంటున్న సిద్ధిపేటలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఆలకుంట గౌరమ్మ(34) కొత్తపల్లి చెరువులో పడి మృతిచెందగా మృతిపై అనుమానాలున్నాయని మృతురాలి సోదరుడు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గౌరమ్మకు ఒక కూతురు ఉంది. ఆమెభర్త కొంతకాలం కిందట అనారోగ్యంతో మరణించాడు. అప్పటినుంచి తల్లి, కూతుళ్లు కూలీపని చేస్తూ జీవిస్తున్నారు. గౌరమ్మ అప్పడప్పుడు మద్యం తాగి కూతురుతో గొడవపడేది. ఈ క్రమంలోనే ఏడాదిన్నర కిందట గౌరమ్మ కూతురుకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. కొద్దిరోజుల కిందట గౌరమ్మ తన కూతురు వద్దకు మరో వ్యక్తితో వచ్చి తాము ఇద్దరం కలిసి ఉంటున్నట్లు చెప్పింది. కొత్తపల్లిలో పొన్న బాలాజీ అనేవ్యక్తితో గౌరమ్మ కలిసి ఉంటున్నట్లు మృతురాలి సోదరుడు తెలిపాడు. ఆదివారం సాయంత్రం బాలాజీ ఇంట్లో మద్యం తాగుతున్న సమయంలో గౌరమ్మ, మరోమహిళ గొడవపడినట్లు తెలిసిందని, బాలాజీ, మరోమహిళపై అనుమానం ఉందని మృతురాలి సోదరుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వడదెబ్బతో రైతు మృతి



గంగరాజం(ఫైల్)

మేడిపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన అత్తిని గంగరాజం(45) అనే రైతు వడదెబ్బతో సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. గంగరాజం రెండు రోజుల నుంచి వరి కోత పనులు చేయిస్తున్నాడు. దీంతో ఆదివారం ఎండదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యాడు. సోమవారం తెల్లావారుజామున గంగరాజం ఇంటిలో మృతిచెందాడు.

భార్యపై హత్యాయత్నం కేసులో భర్త రిమాండ్



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్సై రాజన్న

కరీంనగర్ క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసేందుకు యత్నించిన కేసులో భర్తను కరీంనగర్ పోలీసులు జైలుకు తరలించారు. కరీంనగర్ వన్‌టౌన్ ఎస్సై రాజన్న వివరాల ప్రకారం.. కరీంనగర్ సిఖ్‌వాడిలో గతనెల 18న తనభార్యను హత్య చేసేందుకు యత్నించిన అన్నమనేని కొమురయ్యను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సిఖ్‌వాడిలోని అమ్మ మెస్‌లో వంట పని చేస్తున్న భార్య వద్దకు వెళ్లిన ఆమె భర్త కొమురయ్య అక్కడే మెస్‌లో పొయ్యిపైన ఉన్న వేడికూరను ఆమెపై పోశాడు. దీంతో ఆమె ముఖం, ఛాతి, వీపుభాగాల్లో తీవ్రగాయాలయ్యాయి. హోటల్ యజమాని వెంటనే 108లో ఆమెను ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కొమురయ్యపై కేసునమోదు చేశారు. భార్యపై కొమురయ్యకు అనుమానం ఉండేదని, గతంలో కొమురయ్యపై మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని, దీంతో భార్యపై కక్ష పెంచుకొని హత్య చేసేందుకు యత్నించాడని ఎస్సై తెలిపారు.

డీఈఈ సెట్-2025 నోటిఫికేషన్ విడుదల

తిమ్మాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జిల్లావిద్యా శిక్షణా సంస్థ(డైట్)లలో, ప్రైవేటుకళాశాలలో రెండుసంవత్సరాల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఈడీ), డిప్లొమాఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) మొదటి సంవత్సరం2025-26లో చేరుటకు నిర్వహించే డీఈఈసెట్2025 నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎల్ఎండీ కాలనీలోగల డైట్‌కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాంమొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈకోర్సులో చేరుటకు ఇంటర్‌లో అభ్యర్థులు కనీసం 50శాతంమార్కులు కల్గిఉండాలన్నారు. షెడ్యూల్ తెగలు, షెడ్యూలు కులాల, దివ్యాంగ అభ్యర్థులు కనీసం 45శాతంమార్కులు కలిగి ఉండాలని తెలిపారు. సెప్టెంబరు1, 2025నాటికి అభ్యర్థుల వయస్సు 17సంవత్సరాలు, గరిష్ట వయోపరిమితి లేదనితెలిపారు. దరఖాస్తులు ఆన్లైన్‌లోఈనెల15లోగా సమర్పించాలని తెలిపారు. ఈనెల25న ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. డీఎల్ఈడీ కోర్సు తెలుగు, ఉర్దూ, ఆంగ్లమాధ్యమాల్లో, డీపీఎస్ఈ కోర్సు మాత్రమే ఆంగ్లమాధ్యమంలో ఉంటుందని తెలిపారు. కోర్సును ఏ మాధ్యమంలో చేయదలిస్తే ఆమాధ్యమంలోనే ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షరాయాలని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు డీఈఈ సెట్-2025 వెబ్‌సైట్ deecet.cdse. telangana.gov.in ను సందర్శించాలని తెలిపారు.

జీవాల ఎరువు.. పంటలకు మేలు

- భూసారం పెరిగేందుకు దోహదం
- పొలాల్లో గొర్రెలు, మేకల మందలు
- కోళ్ల ఎరువుకు డిమాండ్



చెర్లబూత్కూర్ శివారులోని పొలంలో గొర్రెల మంద

కరీంనగర్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): కోతలు ముగియకముందే వానాకాలం సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. ముందుగా నేలను సారవంతం చేసేందుకు మూగజీవాల ఎరువును ఉపయోగిస్తున్నారు. పొలాల్లో గడ్డిఉండగానే కొందరు మేకలు, గొర్రెల మందలు పెట్టిస్తుండగా, మరికొందరు కోతలు అయిపోయాక గడ్డిని చుట్టి పశుగ్రాసానికి వినియోగిస్తుండగా, ఇంకొందరు తగలబెట్టి వర్షం కురిసిన తరువాత కలియ దున్నుతారు. ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, కోళ్ల, కంపోస్టు, సేంద్రియఎరువులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రసాయన ఎరువుల వినియోగంతో భూసారం దెబ్బతినడం, పంట దిగుబడి తగ్గుతుండడంతో రైతులు జీవాల ఎరువుల వాడకంపై దృష్టిసారిస్తున్నారు.

రైతులు తమ పొలాల్లో గొర్రెలు, మేకల మందలు పెట్టిస్తున్నారు. గొర్రెలు మేకలమూత్రంలో పీహెచ్ విలువ 7.7ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వీటిద్వారా చౌడుభూముల సారవంతంగా మారుతాయి. లీటర్‌మూత్రంలో 9నుంచి 13గ్రాముల నత్రజని 17నుంచి 20గ్రాముల పొటాషియం, పాస్పరస్ వంటివి ఉంటాయి. ఒక గొర్రెద్వారా ఒక రాత్రికి లీటర్‌మూత్రం 380నుంచి 540గ్రాముల వరకు పేడ లభిస్తుంది. ఒక్కరాత్రి పొలంలో ఉంచేందుకు రూ.1000నుంచి 1500 వరకు కాపరులు తీసుకుంటున్నారు. గొర్రెలు, మేకలమంద ద్వారా నత్రజని, భాస్వరం, పొటాష్‌తోపాటు బాక్టీరియా, ప్రొటోజోవా, ఫంగి తదితర ఉపయోగకరమైన సూక్ష్మజీవులతో నేలసారవంతం అవుతుంది. పశువుల పేడ ట్రాక్టర్‌కు రూ.3,500నుంచి4వేల చొప్పున రైతులు కొనుగోలు చేస్తున్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరుగుతుండటంతో రైతులు పశువుల ఎరువుల కోసం ఇప్పటి నుంచే అడ్వాన్స్‌లు ఇస్తున్నారు.

లారీల్లో కోళ్ల ఎరువు సరఫరా..

కొన్నేళ్లుగా కోళ్లఫారాల నుంచి వచ్చేవ్యర్థాలను ఎరువుగా ఉపయోగించుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వ్యాపారులు హైదరాబాద్, సిద్దిపేట తదితర జిల్లాలోని పౌల్ట్రీలనుంచి కోళ్ల వ్యర్థాలను సేకరిస్తున్నారు. గ్రామాల్లో తిరుగుతూ ఇప్పటి నుంచే రైతులకు లారీల చొప్పున సరఫరా చేస్తున్నారు. చిన్నలారీఅయితే రూ.20వేలు, పెద్దలారీ అయితే రూ.30వేల వరకు తీసుకుంటున్నారు.

కారు, ఆటో ఢీ..ఇద్దరికి గాయాలు

మల్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల- కరీంనగర్ మార్గంలోని రాజారం సమీపంలో సోమవారం రాత్రి కారు, ఆటో ఢీకొన్న ఘట నలో ఒక్కరికి, అదే సమయంలో అక్కడే ద్విచక్రవాహనం ప్రమాదవవత్తూ పడిపోవడంతో ద్విచక్రవాహనంపైగల మరో వ్యక్తికి గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ వైపు నుంచి జగిత్యాల వెలుతున్న కారు, జగిత్యాల వైపు నుంచి నూకపల్లికి వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో ముందు భాగం నుజ్జు కాగ డ్రైవర్ వేముల శివకు గాయాలు అయ్యాయి. ఈ సంఘటన స్థలం నుంచే వెలుతున్న మల్యా లకు చెందిన బోగ రాజశేఖర్ ద్విచక్రవాహనం ప్రమాదవశత్తూ పడిపోవడంతో రాజశేఖర్‌కు గాయాలు అవడంతో గాయపడిన ఇద్దరినీ చికిత్సకోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. కాగా కారు డ్రైవర్ పరారిలో ఉండగా పోలీసులు కారును పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేశారు.

సెల్‌ఫోన్ షాపులో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోతిరాంపూర్‌లోని ఒక సెల్‌ఫోన్ షాపులో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో కొంత ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు.

అంజన్న హుండీ ఆదాయం రూ. 1.07కోట్లు



కొండగట్టులో హుండీల్లోని డబ్బులను లెక్కిస్తున్న సిబ్బంది

మల్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారారూ.1,07,67,134 ఆదాయం సమకూరినట్లు ఈవోశ్రీకాంత్‌రావు తెలిపారు. 39రోజులకు గాను ఆలయంలోని 12హుండీలను విప్పి సోమవారం లెక్కించగా నగదుతోపాటు 134 విదేశీ కరెన్సీనోట్లు లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్, ప్రధానార్చకులు రామకృష్ణ, రఘు, అధికారులు, ఏఎస్సై రమణారెడ్డి పాల్గొన్నారు. కాగాఇన్నాళ్ల హుండీలలో వచ్చిన మిశ్రమ బంగారం, వెండిని తూకం వేయగా ప్రస్తుతం వాటిని తూకం వేయకుండానే సంచిలో సీజ్‌చేసి మళ్లీ హుండీలలోనే వేశారు. స్థానిక శాసనసభ్యుడు మేడిపల్లి సత్యంకు మంత్రి పదవి వచ్చేలా ఆంజనేయ స్వామి ఆశీర్వదించాలంటూ ఎమ్మెల్యే అభిమాని ఒకరు హుండీలో చీటీరాసివేశారు. సోమవారం హుండీల లెక్కింపు సందర్భంగా రూ.500 నోటుకు చీటిపిన్ చేసి ఉండడం సిబ్బంది గమనించారు.

● హుండీల లెక్కింపులో వాగ్వాదం

కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం హుండీల లెక్కింపు సందర్భంగా ఆలయ ఈవో, లెక్కింపునకు వచ్చిన సేవకుడి మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. సేవకు వచ్చిన ఓ రిటైర్డ్ ఎంపీడీవో తదితరులతో సీసీ కెమెరాలో కనిపించే విధంగా లెక్కించాలని ఈవో సూచించి అక్కడినుంచి వెళ్లిపోయారు. కాసేపటికి పర్యవేక్షణలో భాగంగా మళ్లీ ఈవో వచ్చేసరికి రిటైర్డ్ ఎంపీడీవో అలాగే ఉండడంతో వారి మధ్య వాగ్వాదానికి దారితీసింది. అనంతరం సేవకు వచ్చిన ఆ రిటైర్డ్‌ఉద్యోగిని అక్కడి నుంచి పంపివేయడంతో గొడవ సద్దుమణిగింది.

ఈదురుగాలులు..వర్షం

- విరిగిపడ్డ చెట్లు
- నిలిచిపోయిన విద్యుత్‌సరఫరా
- ఆముదాలపల్లి, మెట్‌పల్లి గ్రామాల్లో వడగళ్ల వాన



కేశవపట్నంలో నేలకూలిన విద్యుత్ స్తంభం



వంకాయగూడెంలో జాతీయ రహదారిపై విరిగిపడ్డ చెట్టు

శంకరపట్నం/హుజూరాబాద్/గంగాధర, మే 5 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలో సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. బలమైన ఈదురుగాలులకు వంకాయగూడెం, తాడికల్ గ్రామాల్లో జాతీయరహదారిపై చెట్లు విరిగిపడ్డాయి. గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ముత్తారం, మొలంగూర్ గ్రామాల్లో రెండురేకుల షెడ్లు గాలికి ఎగిరిపోయాయి. ఆముదాలపల్లిలో ఓవ్యక్తి ఇంటి ఎదుట ఉన్న తాడిచెట్టిపై పిడుగుపడి మంటలు అంటుకున్నాయి. ఆముదాలపల్లి మెట్‌పల్లి గ్రామాల్లో వడగళ్ల వాన కురిసింది.

హుజూరాబాద్, గంగాధర మండలాల్లో సైతం ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. అకాలవర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా కాపాడుకు నేందుకు రైతులు ఇబ్బందులుపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు లేకపోవడంతో రైతులు కిరాయికి తెచ్చుకొని ధాన్యంపై కప్పారు. లక్ష్మీదేవిపల్లి, నాగిరెడ్డిపూర్, బూరుగుపల్లి గ్రామాల్లో గోలీకాయల సైజులో వడగళ్లు పడ్డాయి. రెండు గంటలపాటు విద్యుత్ అంతరాయం కలిగింది.

సుల్తానాబాద్: మండలంలోని కదంబాపూర్‌లో సోమవారం వీచిన గాలులకు అభినందన రైసుమిల్లుల గోదాములు ధ్వంసమయ్యాయి. గోదాముల రేకులు ధ్వంసం కాగా మరికొన్ని గాలిలో ఎగిరిపోయాయి. సత్యగణేష్ ఇండస్ట్రీస్ గోదాములు రైస్‌మిల్లు గోదాములు కూడా దెబ్బతిన్నాయి. సుద్దాల, కదంబాపూర్ గ్రామాలల్లో తోటల్లోని మామిడి కాయలు రాలిపోయాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



మార్కర్ నిటారుగా ఉన్నా కనిపించని నీడ

మిట్ట మధ్యాహ్నం నీడమాయం

కరీంనగర్ స్పోర్ట్స్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఖగోళ అద్భుతంతో సోమవారం నుంచి ఈ నెల 14 వరకు మిట్ట మధ్యాహ్నం మనిషి నీడ రెండు నిమిషాల పాటు కనిపించదని ఆస్ట్రాయిడ్స్ సెర్చ్ క్యాంపెయిన్ కన్వీనర్ ఓదెలు కుమార్ తెలిపారు. మంగళవారం దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. మిట్ట మధ్యాహ్నం నీడ మాయమవడాన్ని జీరో షాడోగా వ్యవహరిస్తారన్నారు. సాధారణంగా నీడ మనిషికి ఏదో ఒక పక్క కనిపిస్తుందని, సోమవారం నుంచి 14 వరకు మాత్రం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో సూర్యకాంతి మన మీద లంబంగా పడి నీడ కనిపించదని వివరించారు. భూమి అక్షం 23.5 డిగ్రీలు వంపుగా ఉన్నందున సూర్యుడి చుట్టూ భ్రమణం చేసే సమయంలో సూర్యుడి స్థానం ఉత్తర-దక్షిణ దిశలో మారుతూ ఉంటుంది. ఏటా రెండు సందర్భాల్లో కర్కాటక, మకర రేఖల మధ్య ఉన్న ప్రదేశాల్లో మధ్యాహ్నం సమయంలో సూర్యకిరణాలు భూమిపై సంపూర్ణ లంబంగా పడతాయి. దీంతో నిలువు వస్తువుల నీడ రెండు నిమిషాల వరకు పూర్తిగా మాయమవుతుందన్నారు. ఖగోళ శాస్త్రవేత్తలు సూర్యుడి కదలిక, స్థానాన్ని, అధ్యయనం చేసేందుకు జీరో షాడో ఉపకరిస్తుందని తెలిపారు.


ఓదెలు కుమార్

ఎస్సెస్సీ మార్కుల పునఃపరిశీలనకు అవకాశం



రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు చాన్స్

వెల్గటూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని అనిపించిన విద్యార్థులు, ఫెయిలైన విద్యార్థులు మార్కులను పునఃపరిశీలన చేయడానికి ప్రభుత్వ పరీక్షల విభాగం అవకాశం కల్పించింది. చాలా మంది విద్యార్థులకు సరైన అవగాహన లేకపోవడం వలన పరీక్షల విభాగం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో 38,498 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 37,667 మంది ఉత్తీర్ణులు అయ్యారు. 831 మంది విద్యార్థులు పరీక్షలో ఫెయిల్ అయ్యారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల మార్కుల పునః పరిశీలన కోసం ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం..

జిల్లాల వారీగా విద్యార్థుల వివరాలు

జిల్లా	విద్యార్థులు	ఉత్తీర్ణులు	అనుత్తీర్ణులు
జగిత్యాల	11849	11636	213
కరీంనగర్	12508	12245	263
పెద్దపల్లి	7387	7157	230
రాజన్న సిరిసిల్ల	6754	6629	125

రీ కౌంటింగ్

విద్యార్థులు ఎన్ని సబ్జెక్టుల్లో మార్కులు రీ కౌంటింగ్ చేసుకోవాలని కోరుకుంటారో వాటికి ఒక్కో సబ్జెక్టుకు రూ. 500 ఫీజు చెల్లించాలి.

దరఖాస్తుకు ఈనెల 15 వరకు గడువు

విద్యార్థులు ఈనెల 15లోగా నిర్ణీత రుసుము చెల్లించి మార్కుల లెక్కింపుతో పాటు జవాబు పత్రాల పునఃపరిశీలన చేయించుకోవడానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో సబ్జెక్టుకు రూ.500లు ఎస్‌బీఐ బ్యాంక్‌లో చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. తద్వారా జవాబు పత్రాలను పొందడంతో పాటు తక్కువ మార్కులు వచ్చినట్లు గుర్తిస్తే మళ్లీ అదనంగా మార్కులు పొందే అవకాశం ఉంటుంది. మార్కుల రీ కౌంటింగ్ దరఖాస్తులను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం హైదరాబాద్‌కు నేరుగా కానీ లేదా పోస్టు ద్వారా గానీ పంపించవచ్చు.



దరఖాస్తులను పరీక్షల విభాగం వెబ్‌సైట్ నుంచి తీసుకొని వివరాలు నమోదు చేయాలి. విద్యార్థులకు సంబంధిత సబ్జెక్టులో వచ్చిన మార్కులను మాత్రమే లెక్కించి ఎక్కువ మార్కులు వస్తే సరి చేస్తారు. లేకుంటే మార్కులు అలాగే ఉంటాయి. జవాబు పత్రాలను చూసుకునే అవకాశం ఇందులో ఉండదు.

ఫీజుల వివరాలు

రీవెరిఫికేషన్ కోసం విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. రీ వెరిఫికేషన్‌లో విద్యార్థులు తాము రాసిన జవాబు పత్రాల జిరాక్స్ కాపీలను పొందవచ్చు. దీని వలన తాము రాసిన సమాధానాలకు మార్కులు సరిగా పడ్డాయా? లేదా? మార్కులు ఎన్ని వచ్చాయో చూసుకునే అవకాశం ఉంటుంది. రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకుంటే మళ్లీ మార్కుల రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. రీ వెరిఫికేషన్‌కు హాల్ టికెట్ జిరాక్స్ కాపీ, కంప్యూటరైజ్డ్ ప్రింటెడ్ మెమోతో పాటు పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మాత్రమే అందజేయాలి. ఎస్సెస్సీ బోర్డుకు నేరుగా కానీ, పోస్ట్ ద్వారా గానీ పంపిన దరఖాస్తులు ఆమోదించబడవు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల వ్యక్తిగత చలాన్ ద్వారా ఫీజు చెల్లించాలి. రీ వెరిఫికేషన్‌కు విద్యార్థులు ఈనెల 15 వరకు సంబంధిత ప్రధానోపాధ్యాయులకు దరఖాస్తులు సమర్పించాలని జగిత్యాల డీఈవో రాము సూచించారు.

వేములవాడలో భక్తుల రద్దీ

50 వేలకు పైగా తరలివచ్చిన భక్తులు


క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): హర హర మహాదేవ.. శంభో శంకరా.. అనే నామస్మరణతో రాజన్న ఆలయం సోమవారం మారుమోగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి తెల్లవారు జామున ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించి కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. రాజన్నకు ఎంతో ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు సుమారు నాలుగు గంటలు క్యూలైన్‌లో నిరీక్షించారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీబద్ది పోచమ్మ అమ్మవారికి బోనాలు చేసి డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం కావడంతో 50 వేలకు పైగా భక్తులు తరలివచ్చినట్లు అంచనా వేస్తున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు శ్రావణ్‌కుమార్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్ కుమార్ సూపరిండెంట్ వరి నర్సయ్య, నరేందర్ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్, గిరి, రాజేశంలు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న సింగర్ మానుకోట ప్రసాద్

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని సింగర్ మానుకోట ప్రసాద్ దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఫోక్ సింగర్ ప్రసాద్ రాజన్న ఆలయ చరిత్రపైన నూతన పాటను చిత్రీకరించి త్వరలో విడుదల చేస్తున్న సందర్భంగా రాజన్నను దర్శించుకున్నారు. స్వామి వారి ప్రత్యేక పూజల అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదం అందజేశారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన

కోనరావుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. కోనరావుపేట మండలం వట్టిమల్ల గొల్లపల్లి గ్రామంలో రైతులు రోడ్డుపై బైఠాయించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇప్పటికీ నెలరోజులు గడిచినా 2,000 కింటాళ్లు మాత్రమే తూకం వేశారని మరో 20 వేల క్వింటాళ్లు కొనుగోలు చేయాల్సి ఉందని అన్నారు. వర్షాకాలం దగ్గర పడుతున్న నేపథ్యంలో వెంటనే లారీలను తెప్పించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి రైతులు పాల్గొన్నారు.


...గొల్లపల్లి రైతులు

- రేవంత్‌రెడ్డికి ధైర్యం ఉంటే మావోయిస్టులపై నిషేధం ఎత్తివేయాలి..
- తెలంగాణలో జరిగింది కుల గణన సర్వే... కేంద్రం చేసేది కుల గణన...
- రాజీవ్ రహదారి కాంట్రాక్టు గడువు పొడిగింపునకు యత్నిస్తే వ్యతిరేకిస్తా...
- తెలంగాణకు పదేళ్లలో కేంద్రం రూ.12లక్షల కోట్లు ఇచ్చింది...

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

కులగణనతో బీసీలకు న్యాయం

గోదావరిఖని, మే 5 (ఆంధ్రజ్యోతి): కుల గణనతో బీసీలకు న్యాయం జరుగుతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. సోమవారం ఎన్‌టీపీసీ గెస్ట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం చేపట్టనున్న కులగణనకు రాష్ట్రం చేసిన కుల గణన సర్వేకు పొంతన లేదన్నారు. రాష్ట్ర సర్వేలో కేవలం 50శాతం ప్రజలను మాత్రమే సర్వే చేశారన్నారు. కేంద్రం చేసేది కుల గణన అని, ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తి వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బీసీలకు రిజర్వేషన్ ప్రకటించామని చెబుతున్నా అందులో 10శాతం ముస్లింలకు ఇచ్చారని, ఇక బీసీలకు ప్రతిపాదించింది 32 శాతమేనన్నారు.



మావోయిస్టుల మెప్పు పొందేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌లు పోటీ పడుతున్నారని, రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే రాష్ట్రంలో మావోయిస్టులపై నిషేధం ఎత్తివేయాలని సవాల్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నే మావోయిస్టులను నిషేధించిందన్నారు. పదేళ్ల అధి కారంలో ఉన్న కేసీఆర్ ఆ పార్టీపై ఎందుకు నిషేధం ఎత్తివేసే చర్యలు జరుప లేదని ప్రశ్నించారు. మావోయిస్టు పార్టీతో మాటలు లేవు, మాట్లాడుకోవడాలు కూడా లేవని ఆయన తేల్చి చెప్పారు. వారు బేషరతుగా తుపాకులు వీడి లొంగిపోవాలన్నారు. రాష్ట్రంలో పీపుల్స్‌వార్ పార్టీ, మావోయిస్టులు అనేక విధ్వంసాలకు పాల్పడ్డారని, ఎంతో మంది ప్రజా ప్రతినిధులను, నాయకులను పొట్టన పెట్టుకున్నారన్నారు.

చంద్రబాబుపై అలిపిరిలో దాడి చేశారని, అప్పటి హోం మంత్రి మాధవరెడ్డిని పొట్టనపెట్టుకున్నారన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో నర్సిరెడ్డి, నల్గొండ జిల్లాలో ఎమ్మెల్యే రాగ్యానాయక్, కరీంనగర్ జిల్లాలో మాజీ మంత్రి శ్రీపాదరావు, మల్లర్‌రావులను హత్య చేశారన్నారు. ఇప్పుడు ఆపరేషన్ కగార్ గురించి మాట్లాడుతున్న హరగోపాల్, వరవరరావులు అంత్యక్రియల్లో శవాలను మోయడం తప్ప ఏం సాధించారో చెప్పాలన్నారు. ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీలపై దాడి అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని, ఆదివాసీలు వేరు, మావోయిస్టులు వేరు అన్నారు. ఆదివాసీలకు తుపాకి హింసతో సంబంధం లేదని, వారెన్నడూ ప్రభుత్వంపై తిరగబడలేదన్నా రు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పదేళ్లల్లో రూ.12 లక్షల కోట్ల నిధులను ఇచ్చిందన్నారు. జాతీయ రహదారులకు 1.2 లక్షల కోట్లు, రైల్వే లైన్లు, రైల్వే స్టేషన్ల ఆధునీ కరణకు రూ.32వేల కోట్లు కేటాయించారని, ధాన్యం కొనుగోలుకే 1.5లక్షల కోట్లు ఇచ్చిందన్నారు.

రాజీవ్ రహదారిని అప్పగిస్తే నేషనల్ హైవేగా అభివృద్ధి చేస్తామని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వమే సంబంధిత కాంట్రాక్టర్‌ను ఒప్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. రాజీవ్ రహదారి కాంట్రాక్టర్‌కు గడువును పొడిగించేందుకు కేంద్రం సహకరిస్తుందనేది అబద్ధమని, అలాంటి చర్యలను రాష్ట్రం ప్రతిపాదిస్తే ప్రజలు వ్యతి రేకిస్తారన్నారు. రామగుండంలో ఈఎస్ఐ ఆసుపత్రి గురించి తనకు సమాచారం లేదని, కరీంనగర్ కు మాత్రం ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరైం దన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు కందుల సంధ్యారాణి, మేరుగు హన్మం తుగౌడ్, బల్మూరి వనిత, కోమళ్ల మహేష్, సోమారపు లావణ్య, ధర్మపురి, క్యాతం వెంకటరమణ, బల్మూరి అమరేందర్‌రావు పాల్గొన్నారు.


పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క

ఆదివాసీ ప్రాంతాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలి

- నా విప్లవ బంధం తెగిపోయినా ఆదివాసీ బంధం తెగిపోలేదు
- హింసను ప్రేరేపించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- రాహుల్ ఆలోచన విధానంతోనే దేశంలో కులగణన

ధర్మారం, మే 5 (ఆంధ్రజ్యోతి): విప్లవోద్యమంతో తనకు బంధాలు తెగిపోయినా, ఆదివాసీయుల పేగు బంధం తెగిపోలేదని, ఆదివాసీ ప్రాంతాల్లో స్వేచ్ఛ, శాంతియుత వాతవరణం నెలకొల్పాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ధర్మారం మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీ బిడ్డలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోకుండా ఆదివాసి ప్రాంతాల్లో స్వేచ్ఛ, శాంతి వాతావరణం నెలకొల్పడం ఈ రాష్ట్రంతో పాటు దేశానికి అవసరమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి సంక్షేమం - అభివృద్ధి రెండు కళ్లలాంటివని, సంక్షేమాన్ని మరువకుండా అభివృద్ధిని విస్మరించకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని నడిపిస్తున్నారన్నారు. రాహుల్‌గాంధీ ఆలోచన విధానంతోనే దేశంలో కులగణన చేపట్టారని, అందుకు తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం సంతోషదాయకమని పేర్కొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణతోపాటు పేదలకు లబ్ధి జరిగే సంక్షేమ పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్నారన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నిరుద్యోగులను విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోపే 60 వేల ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులను ఆదుకుందన్నారు. ధర్మారం తెనుగువాడ నుంచి ఎండపల్లి ఎక్స్ రోడ్డు వరకు సీఆర్ఆర్ గ్రాంటు నుంచి 3 కోట్ల 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి, ఖిలావనపర్తిలోని పోచమ్మ ఒర్రె వద్ద సీఆర్ఆర్ గ్రాంటు నుంచి కోటి 25 లక్షల వ్యయంతో పనులకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి శంకుస్థాపస చేశారు.

ప్రభుత్వానికి ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నప్పటికి ఉచిత విద్యుత్, సన్నబియ్యం, ఉచిత బస్సు వంటి పథకాలు పేద ప్రజల కోసం చేపడుతున్నామన్నారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలపై అవగాహన ఉందని, ఎన్నడూ లేని విధంగా అంగన్‌వాడీ బడులకు సెలవులు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ సింగ్, కలెక్టర్ కోయా శ్రీహర్ష, తహసీల్దార్ వకీల్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏఈ రాజశేఖర్, అనుదీప్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

పెగడపల్లి: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని కీచులాటపల్లిలో సోమవారం ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌తో కలసి మంత్రి సీతక్క రూ.20 కోట్ల నిధులతో చేపట్టనున్న నియోజకవర్గ పరిధి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ నియోజకవర్గానికి రూ. 20 కోట్ల సీఆర్ఆర్ నిధులు కేటాయించి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. విడతల వారీగా మరో 30 కోట్లు మంజూరుకు మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.


జిల్లా కేంద్రంలో జిల్లా పరిషత్ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. అనంతరం మండలంలోని నార్సింహునిపేట గ్రామంలో తాండ్ర లక్ష్మీ అనే పేదింటి మహిళ ఇంట్లో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేసిన సన్న బియ్యం భోజనాన్ని మంత్రి సీతక్క, అధికారులు, గ్రామస్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లు, సాగు, తాగు నీటి అవసరాల కోసం ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమాలలో కలెక్టర్ సత్యప్రసాద్, అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి, డీఆర్‌డీవో రఘువరన్, డీపీవో మదన్‌మోహన్, డీడబ్ల్యూఓ నరేష్, పంచాయతీ రాజ్ సీఈ సమత, ఈఈ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ రవీందర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


నార్సింహునిపేటలో లబ్ధిదారు ఇంటిలో భోజనం చేస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

శ్వాస అందక ఉక్కిరిబిక్కిరి

- రోజురోజుకు పెరుగుతున్న ఆస్తమా బాధితులు
- నేడు ప్రపంచ ఆస్తమా దినోత్సవం

సుభాష్ నగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక శ్వాస సంబంధ వ్యాధుల్లో ఆస్తమా ఒకటి. ఊపిరితిత్తుల్లోని వాయునాళాల్లో వివిధ కారణాలతో కండరాలు వాచిపోతాయి. దీంతో ఆ నాళాలు సన్నగా మారుతాయి. ఇది శ్వాసకు ఆటంకంగా మారుతుంది. ఏదైనా చిన్న పని చేసినా ఆయాసం వస్తుంది. ఆస్తమా తీవ్రంగా మారితే పరిణామాలు అత్యంత ప్రమాదకరంగా ఉంటాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 262 మిలియన్ల మంది ఆస్తమాతో ఇబ్బంది పడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) అంచనా ప్రకారం మనదేశంలో 3.4 కోట్ల మంది ఆస్తమాతో బాధపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉబ్బసం గురించి అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం మే మొదటి మంగళవారం రోజు ప్రపంచ ఆస్తమా దినోత్స వాన్ని నిర్వహిస్తారు. డబ్ల్యూహెచ్‌వో ఆధ్వర్యంలో 1998 నుంచి ఆస్తమా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



ఈ సంవత్సరం థీమ్....

ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం ఒక థీమ్ తీసుకుంటారు. ఈ సంవత్సరం 'ఇన్‌హెల్డ్ ట్రీటిమెంట్స్ అందరికి అందుబాటులో ఉండేలా చేయండి' అనే థీమ్‌ను తీసుకున్నారు. ఇన్‌హెల్డ్ కార్టికోస్టెరాయిడ్స్ వంటి అవసరమైన అస్తమా మందులపై అవగాహన కల్పించడం ఈ థీమ్ ఉద్దేశం.

చికిత్సతో ఆస్తమా తగ్గించవచ్చు

డాక్టర్ సుమలత, చెస్ట్ ఫిజీషియన్



అస్తమా వ్యాధి సరైన చికిత్సతో తగ్గిపోతుంది. ఆస్తమా ఉన్నవారు దుమ్ము ధూళికి దూరంగా ఉండాలి. బయటకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా మాస్క్ ధరించాలి. పొగ తాగవద్దు. శీతల పానియాలు, అల్కాహాల్ సేవించవద్దు. వాతావరణంలో మార్పులు వచ్చినప్పుడు జాగ్రత్త వహించాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. అస్తమా లక్షణాలు కనిపించిన వెంటనే ఛాతి వ్యాధి నిపుణులను సంప్రదించాలి. వారి సలహాల మేరకు మందులను క్రమం తప్పకుండా తీసుకోవాలి.

లక్షణాలు, నివారణ

ఆస్తమా లక్షణాలు క్రమక్రమంగా బయటపడతాయి. తరుచుగా అలసట, దీర్ఘకాలిక జలుబు, కాలనుకూలంగా అలెర్జీలు వంటివి ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు. ఆస్తమా ఉన్న వారు వాయు కాలుష్యం, చల్లని గాలి, సువాసనలు మొదలైన వాటికి దూరంగా ఉండాలివ. సిగరెట్లు, కొవ్వొత్తులు, ధూపం, బాణసంచా నుంచి వచ్చే పొగను పీల్చొద్దు. జలుబు లేదా ఫ్లూ ఉన్న వ్యక్తులకు దూరంగా ఉండాలి. పరిసరాలను దుమ్ము ధూళి లేకుండా చూసుకోవాలి. మందులను క్రమం తప్పకుండా తీసుకోవాలి.



● న్యూస్‌బాక్స్

సుభాష్‌నగర్: తెలంగాణ రక్షణ సమితి(డెమోక్రటిక్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిగుర్ల రాజును నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షుడు నరాల సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ రాజు కృతజ్ఞతలు తెలిపారు.

భగత్‌నగర్: కొత్తపల్లి మాజీ వైస్ ఎంపీపీ తిరుపతినాయక్‌ను చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సోమవారం పరామర్శించారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కరీంనగర్ కల్చరల్: స్థానిక భగత్‌నగర్ జడ్పీ క్వార్టర్స్‌లోని సముదాయ ఆలయాల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు సోమవారం వేంకటేశ్వరాలయంలో ఉత్సవ మూర్తులకు అభిషేకం చేశారు. చైర్మన్ యాగండ్ల అనిల్‌కుమార్‌గౌడ్, ధర్మకర్తలు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఆంజనేయ, సుబ్రహ్మణ్య స్వామి వారలకు అభిషేకాలుంటాయ న్నారు.

ఉపాధిహామీలో రైతులకు ఫాంపాండ్‌లు

- భూగర్భ జలాలు పెంచుకునే అవకాశం
- మండలానికి 14 మంజూరు


చెర్లబూత్కూర్‌లో పూర్తయిన నీటి కుంట

కరీంనగర్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఏటా వేసవిలో సాగు నీరందక ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎస్సారెస్పీ ఆయకట్టు ప్రాంతానికి నీళ్లందక పంటలు ఎండిపోతున్నాయి. సాగు నీటి కోసం బోర్లు వేసినా ఆర్థికంగా నష్ట పోతున్నారు. ఈ క్రమంలో వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భజలాలు పెంచు కునేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో ఫాంపాండ్‌ల నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో నీటి కుంటలు (పాంపాండ్) నిర్మాణ పను లు నడుస్తున్నాయి. తాజాగా రైతులు సైతం తమ వ్యవసాయ భూముల్లో నీటి కుంటలను ఏర్పాటు చేసుకునేందుకు ఉపాధిహామీలో అవకాశం కల్పిం చింది. కరీంనగర్ మండలంలోని చామనపల్లి, జూబ్లీ నగర్, మొగ్దుంపూర్, ఇరుకుల్ల గ్రామాల్లో రెండు చొప్పున, నల్లగుంటపల్లి, చేగుర్తి, నగునూర్, బహదూ ర్‌ఖాన్ పేట, ఎలబోతరం1, చెర్లబూత్కూర్‌లలో ఒకటి చొప్పున మొత్తం 14 కుంటలు మంజూర య్యాయి. ఇంకా కొత్తగా మరో ఆరు నీటి కుంటలు మంజూరయ్యే అవకాశం ఉంది. ఆయా గ్రామాల్లో ప్రస్తుతం 13 నీటి కుంటల నిర్మా ణం పనులు జరుగతుండడంతో ఉపాధి కూలీ లకు పని లభిస్తోంది. ఒక్కో నీటి కుంట 20 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పు, 3 మీటర్ల లోతులో నిర్మిస్తున్నారు. మొదటి మీట రున్నర వరకు కూలీలకు క్యూబిక్ మీటర్‌కు 291 రూపాయలు అనంతరం కూబ్యబిక్ మీట ర్‌కు 414 రూపాయల చొప్పున చెల్లిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేక పోవడంతో కూలీలు పెద్ద సంఖ్యలో ఉపాధిహామీ పనులకు హాజరవుతున్నారు.

వ్యవసాయ భూముల్లో నీటి కుంటలు

-ఏపీవో శోభరాణి

రైతులు తమ పొలాల్లో నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవచ్చు ప్రస్తుతం చెరువులు, కుంటల్లో నిర్మాణ పనులు జరుగతున్నాయి. నీటి కుంటతో భూగర్భ జలాలు పెరుగుతాయి. వ్యవసాయ భూముల్లో నీటి కుంటలు నిర్మించుకునేందుకు ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలి.

ప్రతీ రైతుకు యునీ కోడ్

(5వ పేజీ తరువాయి)

తన యాజమాన్య వివరాలను ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేస్తే కేంద్ర ప్రభుత్వం దాని ఆధారంగా రైతు విశిష్ట సంఖ్య(ఫార్మర్ ఐడీ)ని ఇస్తుంది. 11 నెంబర్లతో కూడిన ఈ రైతు గుర్తింపు కార్డు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఉపయోగపడుతుంది.

● రైతు భరోసా, రుణమాఫీతో సంబంధం లేదు

రాష్ట్ర రెవెన్యూశాఖ వద్ద ఉన్న భూ యాజమాన్య వివరాలను మాత్రమే ప్రామాణికంగా తీసుకుని దీనిని జారీ చేస్తారు. ఏ రకమైన యాజమాన్య హక్కును కొత్తగా కల్పించరు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన రైతు భరోసా, రుణమాఫీ తదితర పథకాలకు ఈ రైతు రిజిస్ట్రీ కార్యక్రమానికి ఏరకమైన సంబంధం లేదు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, మే5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా మంగళవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్, టు, రూరల్ ఏడీఈలు శ్రీనివాస్ గౌడ్, లావణ్య, రఘు తెలిపారు. ఉదయం 8:30 నుంచి 10:30 వరకు రాంనగర్, శివనగర్, ప్రగతినగర్, మార్కండేయ నగర్, సప్తగిరి కాలనీ, ఉదయం 8 గంటల నుంచి 11 వరకు సిరిపురం కాలనీ, రజ్వీ చమన్, సిటిజన్ కాలనీ, విజయనగర్ కాలనీ, కృష్ణానగర్ కాలనీ,ప్రియదర్శిని కాలనీ, ఆటోనగర్, ధర్మానగర్, బై-పాస్ ఫ్లైఓవర్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

సుభాష్‌నగర్ మే 5(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యను పరిష్కరించాలని రజ్వీచమన్, సిటిజన్ కాలనీ వాసులు కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కాలనీలను ఇటీవల కరీంనగర్ నగరపాలక సంస్థలో విలీనం చేశారని తెలిపారు. చాలా రోజులుగా చిన్నపైపులైన్ ద్వారా మంచి నీటి సరఫరా చేస్తున్నారని, దీంతో అందరికి నీరు అందడం లేదని అన్నారు. కొంతమందికి మొత్తానికి నీరు రావడం లేదని తెలిపారు.

అంతర్జాతీయ కరాటేకు సీఎస్‌కేఐ క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 5 (ఆంధ్రజ్యోతి): మలేషియాలోని ఐపో నగరంలో ఈ నెల 9 నుంచి 12 వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్ సీఎస్‌కేఐ అకాడమీ నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. బాలికల 19 సంవత్సరాల కటా విభాగంలో ఎం.హాసిని 61 కేజీ, బాలురు 16 సంవత్సరాల కటా విభాగంలో అబ్దుల్ రహీం 55 కేజీలు, 14 సంవత్సరాల కటా విభాగంలో సయ్యద్ మహమ్మద్ 53 కేజీల విభాగంలో ఎంపికైనట్లు సీఎస్‌కేఐ ఫౌండర్, ఇండియా చీఫ్ శ్రీనివాస్ తెలిపారు. క్రీడాకారులను సీఎస్‌కేఐ చైర్మన్ చల్ల హరిశంకర్, ప్రధాన కార్యదర్శి మాడుగుల ప్రవీణ్ తదితరులు అభినందించారు.

ఉద్యోగ సంఘం నాయకులకు బెదిరింపులు తగవు

భగత్‌నగర్, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగ సంఘ నాయకులను బెదిరించడం రాష్ట్ర ముఖ్యమంత్రికి తగదని బీజేపీ విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగ, రాష్ట్ర కో-చైర్మన్ నరహరి లక్ష్మారెడ్డి అన్నారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల న్యాయమైన సమస్యలుపరిష్కరించాలని ప్రభుత్వానికి ఎన్ని విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వం పెడచెవిన పెడుతోందన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.

మంత్రిపై విమర్శలు సరికాదు

సుభాష్‌నగర్, మే 5(ఆంధ్రజ్యోతి): మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ విమర్శించడం సరికాదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి గొర్ల అయిలేశ్ యాదవ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేకల అశోక్‌యాదవ్, కార్యదర్శి కేశవేని రవియాదవ్, కార్యదర్శులు రాజేశ్వరి, శ్రీరాములు శ్రీనివాస్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో హుస్నాబాద్‌కు ఇంజనీరింగ్ కాలేజీ మంజూరు చేయించారని పేర్కొన్నారు.

రేపు వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి

కరీంనగర్ కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి):నగరంలోని అశోక్‌నగర్ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవీమాత జయంతి మహోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు చిట్టుమల్ల శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి పూజలు ఉంటాయని పేర్కొన్నారు.

గద్దర్ గళం పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రజాయుద్ధనౌక గద్దర్ కాంస్య విగ్రహాన్ని త్వరలో కరీంనగర్‌లో ఏర్పాటు చేసి, సభను నిర్వహించేందుకు గద్దర్ గళం బృందం సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసింది. ఈ సందర్భంగా సభకు సంబంధించిన పోస్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ఆవిష్కరించారు.

డంపింగ్ యార్డు తరలించాలి

కరీంనగర్ టౌన్ మే 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని బైపాస్ రోడ్డులో డంపింగ్ యార్డును తరలించాలని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ నగర సమితి ఆధ్వర్యంలో సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డుతో దాదాపు పది డివిజన్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

భూధార్ నమోదులో సాంకేతిక సమస్య

కరీంనగర్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ప్రారంభమైన భూధార్ నమోదులో సాంకేతిక సమస్య తలెత్తడంతో అధికారులు ఇబ్బందులు పడ్డారు. చామనపల్లి, గోపాల్‌పూర్, నగునూర్‌లో రైతు వేదికల్లో రైతుల భూముల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. సాంకేతిక సమస్య తలెత్తడంతో నమోదు ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది.

ఘనంగా సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి జన్మదినం

కరీంనగర్ అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): సుడా చైర్మన్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయా డివిజన్లలో కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు. సుడా కార్యాయంలో మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నరేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. 7వ డివిజన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వాడె వెంకట్ రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు తాజొద్దీన్, కీర్తి కుమార్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చెర్ల పద్మ, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు వివేక్ ఆధ్వర్యంలో పార్టీ అధికార ప్రతినిధి సర్దార్ ధన్నా సింగ్, కొరివి అరుణ్ కుమార్, మన్నెంపల్లి మాజీ సర్పంచ్ అంజయ్య పాల్గొన్నారు.

●నగరంలోని కరీముల్లాషా దర్గలో మైనార్టీ నాయకులు ప్రార్థన చేశారు.

● నగరంలోని 17వ డివిజన్ విద్యనగర్‌లో కొండగట్టు ఉత్సవ కమిటీ మెంబర్ వారాల నర్సింగం, 24వ డివిజన్ అంబేద్కర్‌నగర్, శివాజీ నగర్‌లో కాంగ్రెస్ నాయకులు కుర్ర పోచయ్య, జీడీ రమేశ్, సప్తగిరి కాలనీలో చెన్నాడి రాజేశ్వర్‌రెడ్డి, ధన్నా సింగ్ సరోజ, వెన్నం రజితారెడ్డి, ముల్కల కవిత, మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ తాజొద్దీన్, జీడీ రమేష్, చెర్ల పద్మ, గుండటి శ్రీనివాస్‌రెడ్డి, మూల జైపాల్ పాల్గొన్నారు.


గజమాలతో సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

● భగత్‌నగర్: చింతకుంటలో జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు శ్రావణ్ నాయక్ ఆధ్వర్యంలో సుడా చైర్మన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

ఉగ్రదాడిని ప్రతీ ఒక్కరు ఖండించాలి

సుభాష్‌నగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ప్రతీ ఒక్కరు ఖండించాలని మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. సోమవారం నగరంలోని తారక హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉగ్రదాడి నేపథ్యంలో యుద్ధం రాబోతోందన్నారు. 1960లో యుద్ధం వచ్చినపుడు రూ.30కోట్లు ఖర్చు చేశారని, 1970లో రూ.70 కోట్లు ఖర్చయ్యాయని అన్నారు. త్వరలో జరగనున్న యుద్ధంతో దేశం ఆర్థికంగా ఇబ్బందులు పడ కూడదని ఆర్థిక సహాయాన్ని అందించాలని తమ సామాజిక వర్గం నిర్ణయించిందని తెలిపారు. ఇందులో భాగంగా తాము రూ.13013 అందజేస్తున్నట్లు చెప్పారు. తేరా దియోతే తేరా ఆయేగా(నీవు 13 ఇస్తే తిరిగి అదే 13 నీ దగ్గరకు వస్తుంది) అని తమ గురువు చెప్పాడని, అదే మాటప్రకారం తాము రూ.13013 చెక్కును కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

విద్యుత్ భద్రతా వారోత్సవాలు

గణేశ్‌నగర్,మే 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల ఒకటో తేదీన ప్రారంభమైన విద్యుత్ భద్రతా వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా టీజీఎన్‌పీడీసీఎల్ రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వారోత్సవాల్లో భాగంగా వినియోగదారులకు, ముఖ్యంగా రైతులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే 1912 టోల్ ఫ్రీనంబరులో సంప్రదించాలని సూచించారు.

గ్రంథాలయ చైర్మన్ జన్మదిన వేడుకలు

కరీంనగర్ అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ చైర్మన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశం జన్మదినం సందర్భంగా సోమవారం ఆయన అబిమానులు, కాంగ్రెస్ కార్యర్తలు కరీంనగర్‌లోని మార్కెట్ రోడ్డు స్వయంభు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మార్కెట్, టవర్ సర్కిల్, మాతా శిశు సంక్షేమ ఆస్పత్రి, వీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలో అన్నప్రసాదం నిర్వహించారు.

అక్రమంగా నివసిస్తున్న పాకిస్థానీలను బహిష్కరించాలి

సుభాష్‌నగర్, మే 5(ఆంధ్రజ్యోతి): భారత్‌లో అక్రమంగా నివసిస్తున్న పాకిస్థాన్ దేశస్తులను బహిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్ మద్దతుదారులతో ఆశ్రయం పొందిన ఉగ్రవాదుల దాడిలో పహల్గాంలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే శక్తులపై మునుపెన్నడూ లేనివిధంగా ప్రధాని నరేంద్రమోదీ కఠినవైఖరితో ఉన్నారన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా నివసిస్తున్న పాకిస్థాన్ దేశస్తులను గుర్తించాలని కోరారు మాజీ మేయర్ సునీల్‌రావు, జిల్లా ప్రధానకార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వాసాల రమేశ్, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు, కటకం లోకేష్, రామానుజం, రమణారెడ్డి, వేణుగోపాల్, కొమురయ్య, నాంపల్లి శ్రీనివాస్, అజయ్‌వర్మ, లడ్డు ముందడా, చిట్టిబాబు, రాము పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ స్పోర్ట్స్, మే 5 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ద్వారా ఈ నెల 12 నుంచి నిర్వహించనున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణ తరగతులను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు. నగరంలోని క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా జిల్లా ఒలంపిక్ అసోసియేషన్, క్రీడాశాఖ సహకారంతో ఉచిత వేసవి క్రీడా శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 9న సాయంత్రం 5 గంటలలోపు ఆసక్తి కలిగిన క్రీడల్లో ఫోటో, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో అంబేద్కర్ స్టేడియంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

● తోటలను సర్వేచేసి పరిహారం అందించాలి.. ● బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి


ముదిమాణిక్యంలో నేలరాలిన మామిడి కాయలతో బీఆర్‌ఎస్ నాయకులు

చిగురుమామిడి, మే 5 (ఆంధ్రజ్యోతి): రెండురోజుల నుంచి వరుసగా మండలంలో వీస్తున్న ఈదురుగాలులకు దెబ్బతిన్న మామిడితోటల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్‌జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పార్టీబృందంతో కలిసి మామిడి తోటలను పరిశీలించారు. బాధిత రైతులను ఓదార్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు వెంటనే సర్వేచేసి పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమపార్టీ ఆధ్వర్యంలో రైతులతో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, అకవరం శివప్రసాద్, గుండ శ్రీనివాస్, చంద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

● కరీంనగర్ ట్రాన్స్‌కో ఎస్‌ఈ రమేష్‌బాబు


మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్‌ఈ రమేష్‌బాబు

జమ్మికుంట, మే 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యత అని కరీంనగర్ ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఎమ్ రమేష్‌బాబు అన్నారు. సోమవారం జమ్మికుంట పట్టణంలోని సువర్ణ ఫంక్షన్ హాల్‌లో సిబ్బంది, వినియోగదారులకు విద్యుత్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ట్రాన్స్‌కోఎస్‌ఈ మాట్లాడుతూ విద్యుత్‌భద్రతపై సిబ్బంది, ప్రజలకు అవగాహన పెంచేందుకు అవగాహన సదస్సులు చేపడుతున్న ట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ ఎస్ మల్లారెడ్డి, టెక్నికల్, సేఫ్టిఆఫీసర్ ఉపేందర్, ఏడీఈ సీహెచ్ రాజేందర్, సబ్ డివిజినల్ అసిస్టెంట్ ఇంజనీర్లు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి


సీఎస్ రామకృష్ణారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె రామకృష్ణారావును ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు.

ఉచిత క్రీడా శిబిరం ప్రారంభం

హుజూరాబాద్‌రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం ఉచిత క్రీడా శిబిరం ప్రారంభించిట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ చిరుత శ్రీనివాస్ తెలిపారు. ఈ శిబిరం ఈ నెల 5నుంచి 20వరకు ఉదయం, సాయంత్రం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి రంగు నిరంజన్ చారి, కోచ్‌లు పాల్గొన్నారు.

స్వల్పంగా కంపించిన భూమి

చొప్పదండి/గంగాధర, మే 5 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి, గంగాధర మండలాల్లో సోమవారం సాయంత్రం స్వల్పంగా భూకంపం వచ్చింది. రెండు సెకండ్లపాటు భూమి కంపించగా ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

సైబర్ నేరాలపై అవగాహన

వీణవంక, మే 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం పోలీసులు సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాలపై వివరిస్తూ వాటి నుంచి ఎలా జాగ్రత్తపడాలో ప్రజలకు వివరించారు. అజ్ఞాత లింకులు, ఫోన్ కాల్స్, ఓటీపీ అడిగేవారు, బ్యాంక్ ఖాతాల వివరాలు తెలుసు కునే ప్రయత్నలు చేసే వారు సైబర్ మోసాలకు పాల్పడతారని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి పాల్పడితే 1930కు వెంటనే కాల్ చేయాలని తెలిపారు.చల్లూరు గ్రామంలో ప్రొబేషనరీ ఎస్‌ఐ సాయికృష్ణ అధ్వర్యంలో వాహన తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. మైనర్‌లువాహనలు నడుపరాదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్‌వల్ల ప్రమాదాలు జరుగుతాయని ప్రజలకు అవగాహన కల్పించారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

శంకరపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సరిత సోమవారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ మూడు గ్రూపుల్లో ఒక్కొక్క గ్రూపుకు 40సీట్లు ఉన్నాయని, బాలికలకు ఉచితహాస్టల్ వసతి సదుపాయం ఉందన్నారు. ఈనెల 5నుంచి 20వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, 27నుంచి 31వరకు ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. జూన్1నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

రైతులకు గుర్తింపు కార్డుల నమోదు ప్రారంభం

హుజూరాబాద్‌రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆధార్‌కార్డు తరహాలో రైతులకు రైతుగుర్తింపు కార్డు నమోదు కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏఈవో పొద్దు టూరు సతీష్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయరంగాన్ని ఆధునికీ కరణ చేయుటకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 11అంకెల విశిష్ట గుర్తింపుసంఖ్య అందిస్తోందని తెలిపారు. రైతులు వివిధ పథకాలు, రాయితీలు రాబోవుకాలంలో పొందాలంటే ఈ గుర్తింపు తప్పనిసరి అన్నారు. ఆధార్, భూమి పాస్‌బుక్, ఆధార్ లింక్ చేసిన మొబైల్ నంబర్‌తో తీసుకొని గ్రామపంచాయతీలు, రైతువేదికల్లో సంప్రదించాలన్నారు.

డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్రను విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న హుస్నాబాద్ వ్యవసాయమార్కెట్‌కమిటీచైర్మన్ కంది తిరుపతిరెడ్డి, తదితరులు

చిగురుమామిడి, మే 5 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్రను ప్రజలు, యువకులు, అన్ని రాజకీయపార్టీల నాయకులు విజయవంతం చేయాలని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో డ్రగ్స్‌నిర్మూలన పోరుయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా హుస్నాబాద్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీమన్నారు. అన్నిగ్రామాల్లో మహిళాసంఘాలు సైతం ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈనెల6నుంచి 9వరకు అన్నిగ్రామాల్లో యాత్ర సాగుతుంద న్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ డ్యాగల సారయ్య, గీకురు రవీందర్, సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, జేఏసీ నాయకులు చెప్యాల ప్రకాష్, చిట్టుమల్ల రవీందర్, ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కళాకారులకు నగదు ప్రోత్సాహకం

గన్నేరువరం, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్‌లో నల్లపోచమ్మ నాటక కళాకారులకు యూత్‌కాంగ్రెస్ మాజీరాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి రూ.5వేలు, జిల్లా కార్యదర్శి బొద్దు సునీల్ రూ.2వేలు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాచీన కళలను కాపాడుకునేందుకు, కళాకారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపేలా గ్రామస్థులు ఆదరించాలని కోరారు.

దేశభక్తి, సాంస్కృతిక విలువలు పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలి

చొప్పదండి, మే 5 (ఆంధ్రజ్యోతి): దేశభక్తి, సాంస్కృతిక విలువలు పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కార్యవాహ కొండేటి బాలరాజు అన్నారు. చొప్పదండిలోని సిద్ధార్థ హైస్కూల్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్‌సంఘ్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశభక్తి, సామాజిక సమరసత, కుటుంబవిలువలు, సాంస్కృతిక విలువలను పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సంఘ్ కార్యక్రమాల ప్రాముఖ్యతను, దేశభక్తి, శీలవంతమైన వ్యక్తిత్వ నిర్మాణంలో శిక్షణవర్గాల పాత్రను వివరించారు. కార్యక్రమంలో జిల్లా సహకార్యవాహ గుత్తికొండ రాజశేఖర్, జిల్లా ప్రచారప్రముఖ్ గీకురు శ్రీనివాస్, వర్గ కార్యవాహ దీకొండ అన్వేష్, రామడుగు ఖండ కార్యవాహ ప్రవీణ్, చేపూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం

రామడుగు, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇంటర్ మొదటి సంవత్సర ఫలితాల్లో వెదిరగ్రామానికి చెందిన కోరుకొండ పల్లవి, కోరుకొండ ప్రణీత, పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో రాళ్లబండి అక్షిత్‌రెడ్డి అధిక మార్కులు సాధించగా శ్రీ వినాయకరెడ్డి సంఘం పాలకవర్గసభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ వంచ సుదర్శన్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు వంచ రాజిరెడ్డి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారును కలిసిన నాయకులు

గన్నేరువరం, మే 5 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఉద్యోగ బాధ్యతలను చేపట్టిన గన్నేరువరం తహసీల్దారు జక్కని నరేందర్‌ను యూత్‌కాంగ్రెస్ మాజీ రాష్ట్రసంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బొద్దు సునీల్, కెడిసిసి బ్యాంక్ డైరక్టర్ అలువాల కోటి, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.